క్లుప్తంగా

దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

మెంటాడ: వార్షిక తనిఖీల్లో భాగంగా మండలంలోని ఆండ్ర పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం సందర్శించి, అక్కడి సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. నేరాలు తగ్గేలా చర్యలు తీసుకోవాలని, ఎప్పటి కేసులు అప్పుడు పరిష్కారమయ్యే దిశగా పనిచేయాలని తెలిపారు. అలాగే మహిళా పోలీసులతో సమావేశమై వారు చేపట్టాల్సిన విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం స్టేషన్ ఆవరణలో ఓ మొక్కను నాటి పలువురు నిరుపేద వృద్ధులకు దుప్పట్లు, యువతకు క్రీడాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, గజపతినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణ, ఎస్‌ఐ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

400 లీటర్ల బెల్లంఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న సారా డ్రమ్ములను చూపిస్తున్న పోలీసులు

బొబ్బిలిరూరల్: మండలంలోని కొయ్యికొండవలస గిరిజన గ్రామ సమీపంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న సారాబట్టీలపై ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. 400 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశారు. సారా తయారు చేసినా, అమ్మినా, తరలించినా కఠిన చర్యలు తప్పవని సీఐ చిన్నంనాయుడు హెచ్చరించారు.

సక్రమంగా సేవలందించాలి



శ్యాంపురం సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: గ్రామ సచివాలయాల ద్వారా సక్రమంగా సేవలు అందించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. మండలంలోని శ్యాంపురం, బొద్దాం, పెనుబాక తదితర గ్రామాల్లోని సచివాలయాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి, అక్కడి సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. అలాగే మరుగుదొడ్ల సర్వేతో పాటు హౌస్ హోల్డ్ సర్వేను వేగవంతం చేయాలన్నారు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన

సంతకవిటి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలకు ఆయుర్వేద వైద్యం-దాని సత్ఫలితాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని ఆయుర్వేద వైద్యం జలుబు, దగ్గు, ఆయాసం, కీళ్లనొప్పులు వంటి సమస్యలను దూరం చేస్తాయని ఆయుర్వేద వైద్యుడు ఎం.సునీల్‌కుమార్ తెలిపారు. అందుబాటులోని ఆయుర్వేద వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం జాతీయ ఆయుష్ మిషన్ ప్రచురించిన ఆయుర్వేద పుస్తకాలను ఆశ కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు నాగేంద్రప్రసాద్, సౌమ్యలు, తదితరులు పాల్గొన్నారు.

రుచి, శుచి కలిగి ఉండాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పథకం వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలని, ఆ దిశగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. శుక్రవారం మండలంలోని వండానపేట, ఉప్పర్నాయుడువలస, ఉంగరాడ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను ఆయన పరిశీలించి, సూచనలు చేశారు. మెనూ ప్రకారం వంటకాలు చేయాలని, ప్రతీ వంటకం బాగుండాలని తెలిపారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

బొబ్బిలి: మత్తు పదార్థాలతో జీవితం నాశనమని, ప్రతిఒక్కరూ గంజాయి, మద్యం, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ వి.జ్ఞానప్రసాద్ సూచించారు. స్థానిక పట్టణంలోని విద్వాన్ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువత, విద్యార్థులు ఎక్కువగా ఫ్యాషన్ మాయలో పడి, చెడు అలవాట్ల బారినపడి తమ బంగారు భవిషత్ చెడగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు కూడా పర్యవేక్షణ చేయాలని, ఎప్పటికప్పుడు వారిని మంచి మార్గం వైపు నడిపించాలని తెలిపారు.

అధ్వానంగా రోడ్లు..
జనం అవస్థలు!



అస్తవ్యస్తంగా సంతకవిటి మండలంలోని మందరాడ-గోవిందపురం రహదారి

- మరమ్మతులకు నోచుకోని రహదారులు
- శిథిలావస్థలో పలు ప్రధాన రోడ్లు
- ధ్వంసమైన గ్రామీణ లింకు రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం



రాళ్లు తేలిన రాజాం మండలంలోని గడిముడిదాం-సీఎస్ఆర్ పురం గ్రామాల రోడ్డు



అధ్వానంగా వంగర మండలంలోని ఇరువాడ-చౌదరివలస రోడ్డు



ప్రమాదకరంగా రేగిడి మండలంలోని ఖండ్యాం-గుళ్లసీతారాంపురం రోడ్డు

రేగిడి: రాజాం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రధాన రోడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటితో పాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే లింకు రోడ్లు సైతం మరమ్మతులకు గురై, ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. అడుగుకో గుంత.. గజానికో గొయ్యి.. మాదిరి ప్రస్తుతం రోడ్ల పరిస్థితి ఉంది. దీంతో వాటి మీదుగా ప్రయాణించే వారంతా నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్లు బాగాలేని కారణంగా కనీసం 104, 108 అంబులెన్స్ వాహనాలు కూడా గ్రామాల్లోకి వెళ్లలేని దుస్థితి. ఈ నేపథ్యంలో రోగులు సకాలంలో ఆస్పత్రులకు చేరుకోలేకపోతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చి, ఆరు నెలలైనా గ్రామీణ రోడ్లకే కాదు ప్రధాన రోడ్లకు కూడా మోక్షం కలగడం లేదు. తాను అధికారంలోకి వస్తే గుంతలు లేని రోడ్లు చేసి చూపిస్తానన్న ఆయన మాటలు ఉత్తిదేనా అని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి రోడ్లు బాగు చేయాలని కోరుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

రాజాం మండలంలో మొత్తం 21 పంచాయతీలు ఉండగా, ఏ పంచాయతీకి ఆయా పంచాయతీ పరిధిలోని గ్రామాలకు పక్కా రోడ్ల నిర్మాణాలు జరగలేదు. గతంలో ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ రాజ్‌తో పాటు 14వ ఆర్థికసంఘం నిధులతో రహదారులు వేసేవారు. ప్రస్తుతం వీటి నిర్మాణం కూడా జరగక పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా దోసరి-రాజాం, గడిముడిదాం-సీఎస్ఆర్‌పురం, పెనుబాక-శ్యాంపురం, బొద్దాం-సోపేరు తదితర గ్రామాల మధ్య రోడ్డు సౌలభ్యం కనుమరుగైంది.

వంగరలో..

వంగర మండలంలోని మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల నుంచి పల్లెలకు మట్టి రోడ్లపైనే ప్రజలు నడక సాగించాల్సిన దుస్థితి. ఎన్నికల సమయంలో నేతలు పల్లెలకు వచ్చి, హామీలు ఇస్తున్నారే తప్ప తమకు రోడ్డు సౌకర్యం కలగడం లేదని పల్లె జనం వాపోతున్నారు. మండలంలోని చంద్రంపేట-జనార్థనవలస జంక్షన్, ఇరువాడ-చౌదరివలస, మరువాడ-సీతాదేవిపురం, కొప్పరవలస జంక్షన్-రుషింగి, కొట్టిశ-కె.కొత్తవలస, మద్దివలస-తలగాం తదితర గ్రామాల రహదారుల లింకు రోడ్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో దశాబ్దాల తరబడి మట్టిరోడ్లుగానే మిగిలిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలకు రహదారి కష్టాల తప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేగిడిలో..

రేగిడి మండలంలోని పలు గ్రామాలకు లింకు రోడ్లు అస్తవ్యస్తంగా ఉండడతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. ఏళ్ల తరబడి లింకు రోడ్లను తారు రోడ్లుగా మార్చేందుకు అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారులు చొరవ చూపకపోవడంతో ఆ గ్రామాల ప్రజలకు నేటికీ రోడ్ల కష్టాలు తీరడం లేదు. కొర్లవలస-పనసలవలస, కె.వెంకటాపురం-ఖండ్యాం, అక్కన్నఅగ్రహారం-లక్ష్మీపురం, లచ్చారాయపురం-గుళ్ళపాడు, గుళ్ళపాడు-ఉంగరాడ. సోమరాజుపేట-గుళ్లసీతారాంపురం, అంబఖండి-ఉంగరాడ, వన్నలి-ఉంగరాడమెట్ట గ్రామాల మధ్య రోడ్లు ప్రస్తుతం ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. ఆయా రోడ్లు చినుకు పడితే చాలు ఆ రోడ్ల మీదుగా నడవలేని పరిస్థితి నెలకొంది.

సంతకవిటిలో..

మండలంలో మొత్తం 34 పంచాయతీలు ఉండగా, ఏ పంచాయతీ పరిధిలో కూడా లింకురోడ్లు వేయలేదు. మిర్తివలస-గోవిందపురం గ్రామాల నడుమ లింకురోడ్లు పనులు ప్రారంభించినప్పటికీ పూర్తిస్థాయి నిర్మాణం జరపలేదు. అరకొర పనులతో సరిపెట్టేశారు. దీంతో అటు ప్రజలు, ఇటు ప్రయాణీకులు నానా అవస్థలు పడుతున్నారు. లింకురోడ్లు నిర్మాణాలు లేక గోవిందపురం, నారాయణరాజుపురం, ఇజ్జిపేట, మల్లయ్యపేట-హొంజరాం, మంతిన-అప్పలఅగ్రహారం తదితర గ్రామాల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు.

నిధులు విడుదల కాలేదు..

రేగిడి మండలంలో లింకురోడ్ల నిర్మాణం పూర్తిస్థాయిలో జరగలేదు. గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. పలు గ్రామాల రోడ్లను ప్రధాన రహదారికి అనుసంధానం చేసేందుకు తీర్మానాలు చేసినప్పటికీ నిధులు ఇంకా విడుదల కాలేదు.

-ఆర్.రియాజ్, పీఆర్ జేఈ, రేగిడి మండలం

టీడీఆర్ బాండ్ల జారీపై విజిలెన్స్ విచారణ



చర్చి సెంటరులో విచారణ చేస్తున్న విజిలెన్స్ బృందం

బొబ్బిలి: పట్టణంలోని ఆస్పత్రి రోడ్డు విస్తరణ సమయంలో ఇళ్ల ముందు కొంతస్థలాన్ని కోల్పోయిన నిర్వాసితులకు గతంలో జారీ చేసిన టీడీఆర్ బాండ్లపై విజిలెన్స్ అధికారులు మరోసారి శుక్రవారం విచారణ చేపట్టారు. గతంలో కొన్ని ఇళ్లను శాంపిల్స్‌గా విచారించి, ఉన్నతాధికారులకు ప్రాథమిక నివేదిక ఇచ్చారు. మరికొన్ని ఇళ్లను తనిఖీ చేసి నివేదిక అందించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతం విజిలెన్స్ అధికారులు ఇంటింటికీ వెళ్లి, మీకు ఎంత స్థలం పోయిందన్న వివరాలపై ఆరాతీశారు. ఎస్సెస్‌మెంట్ నంబర్ల వివరాలు నమోదు చేసుకున్నారు. పట్టణంలో 208 ఇళ్ల యజమానులకు పట్టణ ప్రణాళికా విభాగం టీడీఆర్ బాండ్లను జారీ చేసింది. వీటి పూర్తి వివరాలపై విజిలెన్స్ సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలు విచారణ చేపట్టాయి. ఏఈ ప్రేమ్‌కుమార్‌తో పాటు టీపీవో రేవతి, ఆర్‌ఐ పి.సురేష్‌బాబు, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కలిసి ఈ విచారణ చేపట్టారు. విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాద్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామని, వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని సీఐ సతీష్‌కుమార్ తెలిపారు.

పోస్టల్ ఖాతాలు తెరవాలి



పోస్టుమాస్టర్లతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాంబాబు

తెర్లాం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు వర్తించేలా ఎన్‌పీసీఐ లింక్ లేని లబ్ధిదారులందరికీ గ్రామాల్లోని పోస్టాఫీసుల్లో పోస్టల్ ఖాతాలు తెరవాలని ఎంపీడీవో రేగి రాంబాబు సూచించారు. పోస్టల్ ఖాతాలకు సంబంధించి, స్థానిక సబ్ పోస్టు మాస్టర్, బ్రాంచి పోస్టుమాస్టర్లతో శుక్రవారం సమావేశమైన ఆయన.. తెర్లాం సబ్ పోస్టాఫీసు, గ్రామాల్లోని బ్రాంచ్ పోస్టాఫీసుల్లో లబ్ధిదారుల్లో ఎంత మందికి పోస్టల్ ఖాతాలు ప్రారంభించారన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేట్‌బ్యాంక్, ఏపీజీవీబీ, ఇతర బ్యాంక్‌లలో లబ్ధిదారుల ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ లేని వారందరికీ పోస్టాఫీసుల్లో ఖాతాలు తెరవాలని తెలిపారు. పోస్టాఫీసులకు ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

తెర్లాం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్(యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్) 50 ఏళ్లుగా ఎంతగానో కృషి చేస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి ప్రశంసించారు. స్థానిక వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె.. రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి, వాటిని పరిష్కరించడంలో యూటీఎఫ్ ఎప్పుడూ ముందున్నదన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలయ్యేలా పోరాటం చేస్తున్నామని, దీనిని సాధించేందుకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు తమవంతు సహకారమందించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు రామ్మూర్తినాయుడు, ప్రసన్నకుమార్, మండల యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.మునిస్వామి, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటరు నమోదుకు స్పెషల్ డ్రైవ్

రాజాం సిటీ: రాజాం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 23, 24వ తేదీల్లో ఓటరు నమోదుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్.జోసెఫ్ ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాల వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, 18 ఏళ్ల వయసు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావాలన్నారు. విధులకు హాజరుకాని బీఎల్‌వోలపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వంగర: ఓటర్ల జాబితాలో సవరణలకు ఈ నెల 23, 24వ తేదీల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు దిరిశాల ధర్మరాజు తెలిపారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ప్రకటించిన ఓటరు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, పేర్లలోని తప్పులు, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాల్లో ఏవైనా అభ్యంతరాలుంటే పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండే బీఎల్‌వోలకు తెలియజేయాలన్నారు.

వ్యక్తికి గాయాలు

వంగర: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మగ్గూరుకు చెందిన పెద్దింటి పవన్ అనే వ్యక్తి గాయాలపాలైనట్లు ఎస్‌ఐ షేక్ శంకర్ శుక్రవారం తెలిపారు. అతడు తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, అదుపు తప్పి కింద పడిపోవడంతో అతడికి గాయాలయ్యాయి. వైద్య సేవల కోసం రాజాంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి క్షతగాత్రుడిని తరలించారని ఎస్‌ఐ పేర్కొన్నారు.

జోరుగా 'ఉపాధి' పనులు

బాడంగి: మండలంలోని ముగడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో ఎస్.రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. వేతనదారులకు అసౌకర్యం కలగకుండా పని ప్రదేశంలో ఏర్పాట్లు చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. పని చేసే చోట తాగునీరు, నీడ ఉండేలా చూసుకోవాలని తెలిపారు.

నిరసన



తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 108 వాహన ఉద్యోగులు శుక్రవారం నిరసనకు దిగారు. రాజాం ప్రాంతీయ ఆస్పత్రి ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి మరీ తమ హక్కులపై నినదించారు. జీవో నంబరు 49 ప్రకారం జీతాలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, మూడు షిఫ్టుల విధానంలో డ్యూటీలు వేయాలని, ఇచ్చిన హామీ మేరకు వేతన శ్లాబ్‌లను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ మండల కేంద్రంలో వాహన సిబ్బందికి శాశ్వత భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. -రాజాం సిటీ

వేతనాలు పెంచాలని డిమాండ్



తమ సమస్యలు పరిష్కరించాలని జాతీయ ఉపాధి హామీ పథకం కార్యాలయాల్లో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంట్ అసిస్టెంట్లు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై వారంతా రామభద్రపురంలోని ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఆ పథకం స్టేట్ డైరెక్టర్ షణ్ముక్ కుమార్, డ్వామా పీడీ కల్యాణ్ చక్రవర్తిలకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న తమకు వేతనాలు పెంచాలని, పని ఒత్తిడి తగ్గించాలని, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంట్ అసిస్టెంట్ల ఖాళీలను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సదరు అధికారులు స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వి.లక్ష్మి, పి.గౌరీశంకర్, పి.జ్యోతి తదితరులు ఉన్నారు. -రామభద్రపురం

అన్నదాత ఆందోళన



ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదనుగా కొంత మంది దళారులు రైతుల వద్ద ధాన్యం కొనుగోళ్లకు అడ్వాన్సులు కూడా చెల్లిస్తున్నట్లు సమాచారం. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఓ వైపు కోతలు జరుగుతుండగానే మరోవైపు కొనుగోళ్లు చేసి, రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టింది. ఇప్పుడు కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటికీ కొనుగోళ్లు చేపట్టకపోవడంతో ఇంకా పొలాల్లోనే వరి కుప్పలు ఎదురు చూస్తున్నాయి. ప్రభుత్వం కొనుగోలు చేసే లోపు వాతావరణం బాగుంటే పర్లేదు కానీ అకస్మాత్తుగా వర్షాలు కురిస్తే పరిస్థితి ఏంటని బాడంగి ప్రాంత అన్నదాతలు అనుకుంటున్నారు. -బాడంగి

రైతులకు రుణాలు ఇవ్వండి



సూచనలిస్తున్న నాబార్డు ఏజీఎం నాగార్జున

బొబ్బిలిరూరల్: రైతుల పంటల సాగుకు విరివిగా రుణాలు ఇచ్చి, సహకరించాలని నాబార్డు బ్యాంకు ఏజీఎం నాగార్జున సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్టేట్‌బ్యాంకు ఆధ్వర్యంలో బ్యాంకర్ల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం బ్యాంకర్లకు ఉందన్నారు. రైతులు ఎవ్వరినీ మోసం చేయరని, వారికి అవసరమైన రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



ఆక్రమిత భూములు పరిశీలిస్తున్న గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

బొబ్బిలిరూరల్: మండలంలోని సీహెచ్ బొడ్డవలస పంచాయతీ పరిధిలోని నిమ్మలపాడు గిరిజన గ్రామ సమీపంలోని ప్రభుత్వ డీకేటీ భూములు ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం ఆ ప్రాంతంలోని ఆక్రమిత భూములను పరిశీలించిన వారు.. సాలూరు మండలంలోని బోగవలస గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇక్కడి భూములను కబ్జా చేశారని స్థానిక గిరిజనులు వారికి తెలిపారు. ఈ మేరకు వారు ఎన్నో ఏళ్లుగా ఇక్కడి గిరిజనులు ఇక్కడి ప్రభుత్వ డీకేటీ భూముల్లో జీడితోటలు సాగు చేస్తున్నారని, ఇటీవల బోగవలసకు చెందిన ఇద్దరు రియల్టర్లు ఆ భూమిపై కన్నేశారని, 10 ఎకరాల వరకు ఆక్రమించారని ఆరోపించారు. గిరిజనులను భయభ్రాంతులకు గురిచేసి మరీ ఆక్రమణదారులు ఆ భూమిలోని జీడిచెట్లను తొలగించారన్నారు. పంటపొలాలకు సాగునీరు తీసుకువెళ్లే కాలువలను సైతం మట్టితో కప్పారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సర్వే చేసి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, గిరిజన సంఘం నాయకులు గెమ్మల జానకీరావు, పొట్టి రాము పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

బెల్టుషాపులపై ప్రత్యేక నిఘా



మాట్లాడుతున్న సీఐ ఉపేంద్రరావు

వంగర: గ్రామాల్లో బెల్టుషాపులపై ప్రత్యేక నిఘా ఉంచామని సీఐ ఉపేంద్రరావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులతో శుక్రవారం సమావేశమైన ఆయన.. అక్రమంగా మద్యం రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఎక్కడైనా బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు జరిగితే సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ షేక్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

25న అప్రెంటిస్ మేళా

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 25వ తేదీన అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో ఖాళీలను భర్తీ చేయడానికి అవసరమైన ఐటీఐ పాస్ అయిన విద్యార్థులను ఎంపిక చేయనున్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఈ మేళాకు హాజరుకానున్న అభ్యర్థులంతా ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

అగ్నిఅస్త్రంతో కత్తెరపురుగు నివారణ



అగ్నిఅస్త్రం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం సిటీ: కత్తెరపురుగు నివారణకు అగ్నిఅస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఇన్‌చార్జి పద్మ అన్నారు. మండలంలోని జీసీపల్లి, ఎం.జోగివలస గ్రామాల్లో అగ్ని అస్త్రం తయారీపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆవుమూత్రం, వేప ఆకులు, పచ్చిమిర్చి, వెల్లుల్లి, పొగాకు కాడలు తీసుకుని బాగా మరగపెట్టాలని. ఆ మిశ్రమం చల్లారిన 48 గంటల తర్వాత వడపోసుకుని పంటలో పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి రమాదేవి, ఐసీఆర్‌పీలు శ్రావణి, భాను తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ సామగ్రి నిల్వ కేంద్రంతో ప్రయోజనం లేదు..

బాడంగి: మండల కేంద్రానికి సమీపంలోని బ్రిటిష్ కాలం నాటి ఎయిర్ స్ట్రిప్ ప్రాంతంలో నావికా దళం వారు పెట్టదలచిన యుద్ధ సామగ్రి నిల్వ కేంద్రంతో ఎవరికీ ప్రయోజనం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అభిప్రాయపడ్డారు. స్థానిక ఎయిర్ స్ట్రిప్ ప్రాంత పరిసరాలను శుక్రవారం సందర్శించిన ఆయన.. ఒకవేళ ఇక్కడ పెట్టే యుద్ధ సామగ్రి నిల్వ చేస్తే ప్రమాదం జరిగేందుకే అవకాశం ఎక్కువని, అంతేగానీ స్థానికులకు అందులో ఉద్యోగావకాశాలు లభిస్తాయన్న గ్యారంటీ లేదన్నారు. రైతులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

కలష్మం లేని ఆలోచనే దైవత్వం..

రాజాం: కలష్మం లేని ఆలోచనలు, పనులు దైవత్వంతో సమానమని విజయనగరానికి చెందిన ప్రవచన కర్త రామ్మోహనరావు అన్నారు. స్థానిక పట్టణంలోని సుందరం సత్యసాయి మందిరంలో సత్యసాయి జయంతి సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. మానవుడు ప్రేమతత్వాన్ని అలవాటు చేసుకోవాలని, ప్రతీ అంశాన్ని అనుకూలంగా స్వీకరించాలన్నారు. ఆరోగ్యకరమైన ఆలోచనలతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరికీ తనవంతు ప్రతిఫలం లేని సాయం అందించడమే దైవమార్గమని సత్యసాయి ప్రబోధించారన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులను సత్కరించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



ఉంగరాడమెట్ట వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట, బూరాడ, సంకిలి తదితర గ్రామాల కూడళ్లలో ముమ్మరంగా వాహన తనిఖీలు శుక్రవారం చేపట్టారు. ఎస్‌ఐ పి.నీలావతి తమ సిబ్బందితో కలిసి అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి వాహన ధ్రువపత్రాలు, వారి లైసెన్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్‌లోని చలాన్లు తక్షణమే కట్టాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అక్రమంగా మద్యం తరలించినా, గంజాయి, కొకైన్, ఖైనీ, గుట్కా వంటి నిషేధిత మాదక ద్రవ్యాలు తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పక్కాగా రికార్డుల నిర్వహణ

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత సూచించారు. మండలంలోని అంబఖండి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-1, 2, 3లతో పాటు సోమరాజుపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని తెలిపారు. రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఆరోగ్య సలహాలు అందించాలన్నారు.